క్లుప్తంగా

ఏరియా ఆస్పత్రి తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అమలాపురం టౌన్: అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని కొందరు సిబ్బంది బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారంటూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఫిర్యాదు చేసినట్లు బాబూ జగ్జీవన్‌రాం సమతా మూమెంట్ కన్వీనర్ టీఎం ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదే సమస్యపై 'జగనన్నకు చెబుదాం' 1902 ఫోన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశామన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

ఐ.పోలవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఐ.పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కర్రి మౌనిక, ఉద్దిశ సూర్య శ్రీవీర గణేష్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కడప జిల్లా రాయచోటిలో ఈ నెల 26 నుంచి 28 వరకూ జరిగే పోటీల్లో వారిద్దరూ ఆడనున్నారు. భూపతిరాజు చంటిబాబు, పాఠశాల హెచ్‌ఎం వీధి సురేష్ బాబు, రేవు సారెడ్డి, జంపా సత్యనారాయణ తదితరులు విద్యార్థుల్ని అభినందించారు.

ఎంజీఆర్ కళాశాలలో దరఖాస్తుల స్వీకరణ

ముమ్మిడివరం: ముమ్మిడివరం ఎంజీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశానికి ఈ నెల 15 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ మంగారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ కోర్సులలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులు ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

కాట్రేనికోన: కందికుప్పలో విధులు నిర్వహిస్తున్న అత్యవసర సేవలు 104 సిబ్బంది ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. 104 సిబ్బంది వేతనాలను నేరుగా ప్రభుత్వం చెల్లించి ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు.

ఘనంగా ముగిసిన భాగవత సప్తాహం

తాళ్లరేవు: పవిత్ర వైశాఖ మాసం సందర్భంగా ప్రముఖ ప్రవచనకర్త ఓలేటి వేంకట బంగారేశ్వరశర్మ భాగవతంపై చేసిన సప్తాహ ప్రవచనం శనివారంతో ఘనంగా ముగిసింది. మండల పరిధిలోని ఇంజరం శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత విజయ గోపాలస్వామివారి ఆలయ ప్రాంగణంలో వారం రోజుల పాటు శ్రీకృష్ణ లీలలు, బాల్య క్రీడలు, రాక్షస సంహారం, గోపికాగీతలు, శ్రీకృష్ణస్తుతులు, రుక్మిణీ కల్యాణం తదితర ఖండాలను ఆసక్తికరంగా వివరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సోమేశ్వరరావు తదితరులు బంగారేశ్వర శర్మను దుశ్శాలువాతో సత్కరించారు.

పేద కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ

యానాం: గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక అంబేడ్కర్‌నగర్ నివాసితుడు నీరుపూడి సత్యనారాయణకు పేదవాడికి చేయూత కార్యక్రమం ద్వారా సామాజిక కార్యకర్త దుగ్గదుర్తి అనిత ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. సత్యనారాయణకు 25 కేజీల బియ్యం, కిరాణా సామగ్రి, కాయగూరలు అందజేశారు. కార్యక్రమంలో రెయ్యా ప్రసన్నకుమార్, శికిలే జయరాం, పైడికొండల రాజా, మోకా రామలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్: ఈదరపల్లిలో 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం పట్టణ, రూరల్ పరిధిలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఈఈ మోకా రవికుమార్ తెలిపారు. ఎర్రవంతెన ఫీడర్, మెయిన్ రోడ్డు, ఆర్టీసీ బస్‌స్టేషన్, గడియార స్తంభం, ముమ్మిడివరం గేట్, ఏరియా ఆసుపత్రి ఫీడర్, దుడ్డివారి అగ్రహారం, కేఎస్‌ఎఫ్ రోడ్, వానపల్లివారి వీధి, కనకదుర్గ వేపచెట్టు, నల్లవంతెన, ఆర్డీవో ఆఫీస్ రోడ్, సూర్యనారాయణపేట, నల్లవంతెన, కలెక్టర్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

చేనేత సహకార సంఘ చైర్మన్ సత్యనారాయణ మృతి




సత్యనారాయణ(ఫైల్)

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి చేనేత పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ గంపల సత్యనారాయణ(63) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. సర్పంచ్ ఊర్మిళాదేవి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, సంఘ నాయకులు ఆశపు బుజ్జి, కారుపర్తి గిరిజాపతి, పిచ్చిక అశోక్ తదితరులు సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ప్రేమకు ప్రతిరూపం.. త్యాగానికి నిదర్శనం

నేడు ప్రపంచ మాతృ దినోత్సవం



యానాం: మాతృదేవోభవ, పితృదేవోభవ అంటూ అమ్మకే అగ్రతాంబూలం ఇచ్చారు. ఆమెకు ఇరవై నాలుగు గంటల ఉద్యోగం.. సెలవులు ఉండవు.. ప్రమోషన్లు లేవు.. రిటర్మెంటే లేదు.. ఆమె శ్రమను కొలిచినా, స్వేద బిందువులను లెక్కగట్టినా చెల్లించలేనంత రుణం.. ప్రపంచంలో వెలకట్టలేని పదం ఉందంటే అది అమ్మ. తొలిగురువు అమ్మ.. అమ్మంటే ప్రేమకు ప్రతిరూపం.. త్యాగానికి నిలువెత్తు నిదర్శనం.. అమ్మ ప్రేమ గురించి ఎంత చెప్పినా తక్కువే. దేవుడి నుంచి మనం పొందిన గొప్పవరం అమ్మ. మదర్స్‌డే రోజున థ్యాంక్స్ మామ్ అనే చిన్న మాటతో రుణాన్ని తీర్చుకోలేం. కాని ఈ ప్రత్యేకమైన రోజును ఆమె కోసం మీరు కొంత సమయం కేటాయించండి. అమ్మపై మీకు ఎంత ప్రేమ ఉందో నిజాయతీగా తెలపండి.

అమెరికాతో పాటు ప్రపంచంలోని పలు దేశాలు మదర్స్‌డేను మే నెలలోని రెండవ ఆదివారం జరుపుకుంటారు. 1868లో ఎన్‌జూర్వీస్ మదర్స్ ఫ్రెండ్‌షిప్ డేను ఏర్పాటుచేసి కమిటీని ఏర్పాటు చేశారు. ఆమె 1905లో మరణించగా ఆమె కుమార్తె జెర్విస్ మాతృదినోత్సవం కోసం అమెరికా వ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు. 1911 నాటికి అమెరికా రాష్ట్రాల్లో మాతృదినోత్సవాన్ని జరపడం ప్రారంభించారు. 1914నుంచి అమెరికా అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ దీన్ని అధికారికంగా జరపాలని నిర్ణయించారు. ఇది కాస్తా కాలక్రమేణా ప్రపంచ వ్యాప్తంగా ఏటా మే నెల రెండో ఆదివారాన్ని మాతృ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

అమ్మకు ప్రథమ తాంబూలం



ప్రపంచంలో ఏదైనా గొప్ప పదం ఉందంటే అది అమ్మ అనే పదం మాత్రమే. లోకంలో చెడ్డ తండ్రులు ఉంటారేమో గాని చెడ్డ తల్లులు ఉండరనేది సామెత. ప్రపంచ సాహిత్యంలో అమ్మకు నీరాజనాలు పట్టినట్లు మాగ్జిమ్ గోర్కీ నవలలు తెలియజేస్తాయి. భారతీయ సాంప్రదాయంలోను మాతృదేవోభవ అని అమ్మకు ప్రథమ తాంబూలం ఇచ్చారు.

– కళారత్న శిఖామణి, కేంద్ర సాహిత్య అకాడమీ సలహామండలి సభ్యులు

అక్షరాలు సరిపోవు



అమ్మను కీర్తించడానికి అక్షరాలు సరిపోవు. పురుడు పోసుకోవడం అంటే కొత్త జన్మ ఎత్తినట్లే కదా. నన్ను కనడానికి ముందు మా అమ్మ 11 జన్మలు ఎత్తింది. పుట్టిన నెలలోపే వారంతా చనిపోయాక బతికి బట్టకట్టింది నేనే. అందుకే అమ్మ రుణం తీర్చుకోలేనిది. నడయాడే దేవతకు ప్రతిరూపం అమ్మ. జీవితం సార్థకం చేసుకోవాలంటే అమ్మను ఆరాధించాలి.

– దాట్ల దేవదానం రాజు, ప్రముఖకవి

16న ఎమ్మెల్సీ కుడుపూడికి ఆత్మీయ స్వాగతం



ఏర్పాట్లపై చర్చిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

అమలాపురం టౌన్: ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన కుడుపూడి సూర్యనారాయణరావు ఈ నెల 15న అమరావతిలోని శాసన మండలిలో ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 16వ తేదీన ఎమ్మెల్సీ కుడుపూడి విజయవాడ నుంచి బయలుదేరి అమలాపురం రానున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు కోనసీమ ముఖద్వారం రావులపాలెం నుంచి అమలాపురానికి ఊరేగింపుగా తీసుకొచ్చేందుకు పార్టీ నాయకులు నిర్ణయించారు. స్థానిక సూర్యనగర్‌లోని కమ్యూనిటీ హాలులో స్వాగత ఏర్పాట్లపై చర్చించేందుకు పార్టీ నేతలు శనివారం సమావేశమయ్యారు. 16వ తేదీన ఎమ్మెల్సీ కుడుపూడిని రావులపాలెం నుంచి కొత్తపేట, ముక్కామల, అంబాజీపేట, ఈదరపల్లి మీదుగా అమలాపురానికి భారీ ఊరేగింపుతో తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశ వేదిక ఏర్పాట్ల పరిశీలన



కాట్రేనికోనలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్

కాట్రేనికోన: మండలంలో ఈ నెల 16న నిర్వహించనున్న మత్స్యకార భరోసా పంపిణీ సమావేశ వేదిక ఏర్పాట్లను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా మత్స్యకార భరోసా, ఓఎన్‌జీసీ నష్ట పరిహారం లబ్ధిదారుల ఖాతాలకు జమ అవుతాయన్నారు. మత్స్యకార భరోసా, ఓఎన్‌జీసీ లబ్ధిదారులు ప్రతిఒక్కరూ సమావేశానికి రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, నల్లా నరసింహమూర్తి, సంసాని నాగేశ్వరరావు, నడింపల్లి సూరిబాబు, ఏపీఎం వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కామేశ్వరరావు తదితరులున్నారు.

విశ్రాంత ఉద్యోగులు ఏవీసీలు త్వరగా అందజేయాలి



ఏటీవో రంగారావును కలిసిన జిల్లా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం ట్రెజరీ పరిధిలోని ఇప్పటివరకూ యాన్యువల్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ (ఏవీసీ) సమర్పించని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు మాన్యువల్‌గా దరఖాస్తు పూర్తి చేసి నేరుగా ఎస్‌టీవో కార్యాలయానికి వచ్చి ఫిజికల్ వెరిఫికేషన్ చేయించుకోవాలని అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్(ఏటీవో) రంగారావు సూచించారు. స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ప్రతినిధులు ఏటీవో రంగారావును స్థానిక ట్రెజరీ కార్యాలయంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఏటీవో రంగారావు మాట్లాడుతూ కదలలేని స్థితిలో, అనారోగ్యంతో ఉన్న వారు, దూర ప్రాంతాల్లో ఉండి రాలేనివారు ఏవీసీ దరఖాస్తులు పూర్తి చేసి, సంతకాలు చేసి వారి ప్రతినిధుల ద్వారా పంపించాలని ఆయన సూచించారు. అలా పంపించిన పెన్షనర్లను వీడియో కాలింగ్ పద్ధతిలో ఏవీసీని ఆమోదిస్తున్నట్లు వివరించారు. వీరందరికీ వచ్చే నెల పెన్షన్‌తో పాటు ఏప్రిల్ పెన్షన్ కలిపి చెల్లించే ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎస్‌టీవో కార్యాలయ పరిధిలో ఇంకా దాదాపు వెయ్యి మంది పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకోలేదని స్పష్టం చేశారు. ఏటీవోను కలిసినవారిలో జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పారుపూడి కృష్ణ శాస్త్రి, అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సాయివరప్రసాద్, ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు, కోశాధికారి జేఎస్ శర్మ, ఎస్‌సీహెచ్ కృష్ణమూర్తి తదితరులున్నారు.

పశు గ్రాసాలుగా వ్యవసాయ క్షేత్రాలు



మొగళ్ళమూరులో పశుగ్రాస క్షేత్రంగా మార్చేసిన వ్యవసాయ భూమి

అల్లవరం: ఆక్వా సాగు శివారు ప్రాంతాల నుంచి వ్యవసాయ క్షేత్రాలకు విస్తరించడంతో వ్యవసాయ సాగు నానాటికి తగ్గిపోతుంది. అల్లవరం మండలంలో ఆక్వా సాగువైపు మళ్లలేక వ్యవసాయాన్ని వదులుకోలేక పంట భూముల్ని పశుగ్రాసాల కోసం వదిలేస్తున్నారు. బీరవారిపేటకు ఆనుకుని ఉన్న సుమారు 50 ఎకరాల వ్యవసాయ భూమి గత నాలుగేళ్లుగా సాగు చేయడం లేదు. కొందరు రైతులు ఈ భూముల్లో ఆక్వా చెరువులు చేయాలని గత కొంత కాలంగా పంట వేయకుండా ఖాళీగా వదిలేశారు. మరికొంతమంది రైతులు మాత్రం దాళ్వాలో వరి వేసి పండిస్తున్నారు. అయితే పాడి ఉన్న రైతులు మాత్రం వ్యవసాయ క్షేత్రాలను ఖాళీగా వదిలేయకుండా పశువులకు అవసరమైన గడ్డిని పెంచి మేత కొరతను తీర్చుతున్నారు. కొంత మంది రైతులు ఆక్వా సాగుపై మొగ్గు చూపడంతో వ్యవసాయ క్షేత్రాలకు ఈ పరిస్థితి ఎదురైంది.

కర్ణాటకలో విజయంపై కాంగ్రెస్ సంబరాలు

అమలాపురం టౌన్: కర్ణాటక రాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ విజయం సాధించడంపై పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు స్థానిక గడియారం స్తంభం వద్ద శనివారం సాయంత్రం సంబరాలు జరుపుకున్నారు. **ముమ్మిడివరం:** కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంపై ముమ్మిడివరంలో పెన్మత్స జగ్గప్పరాజు అధ్యక్షతన కార్యకర్తలు సమావేశమై హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుకున్నారు.

ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ మహోత్సవం



మగసానితిప్పలో ధ్వజస్తంభం ప్రతిష్ఠా మహోత్సవం

కాట్రేనికోన: కాట్రేనికోన: బ్రహ్మసమేధ్యం పంచాయతీ మగసానితిప్ప గ్రామంలో వేంచేసి ఉన్న కాలభైరవస్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితుల పర్యవేక్షణలో గత రెండు రోజులుగా గణపతి పూజ, పంచగవ్యప్రాశనం, దీక్షాధారణ, అంకురార్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు రెండు వందల ఏళ్ళ క్రితం నాటి ధ్వజ స్తంభం శిథిలం కావడంతో నూతన ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. బలుసుతిప్ప, మగసానితిప్ప, కాకినాడ, యానం, దరియాలతిప్ప తదితర గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు, ఆదినారాయణ, పాలెపు ధర్మారావు, సంగాని పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారి ధ్వంసం



ప్రొక్లెయినర్ పనులతో ధ్వంసమైన రహదారి



మున్సిపల్ ప్రహరీ గోడ కూల్చేసిన దృశ్యం

యానాం: పట్టణ పరిధిలోని పాత స్టాబోర్డు అట్టల ఫ్యాక్టరీ నుంచి భీమ్‌నగర్‌కు వెళ్లే రహదారిలో గతంలో వంద మీటర్ల మేర మున్సిపాలిటీ నిధులతో భారీ ప్రహరీ గోడను నిర్మించారు. అయితే ఇటీవల అట్టల ఫ్యాక్టరీ స్థలంలో గృహనిర్మాణాలకు లేఅవుట్ వేశారు. దానికోసం అడ్డుగా ఉందని మున్సిపాలిటీ ప్రహరీ గోడను నేలమట్టం చేశారు. దీనిపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా స్థానిక అధికారులు పట్టించుకోలేదు. శనివారం అక్కడ ప్రభుత్వం నిర్మించిన సిమెంట్ రహదారిని సైతం భారీ ప్రొక్లెయిన్లతో ధ్వంసం చేశారు. స్థానికులు ఈ ఘటనపై ఎల్జీ తమిళిసై సౌందరాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గోడ కూల్చివేత, రహదారి ధ్వంసంపై కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ గోయల్ స్పందించాలని కోరుతున్నారు.

యానాం నవోదయలో నూరుశాతం ఉత్తీర్ణత



సాయిహాసిని



యోగలక్ష్మి



దివ్యాన్ష



మల్లాది శివకాశి



లాస్య



సాయినాయుడు

పుదుచ్చేరి రీజియన్ ఫలితాల్లో ప్రథమ స్థానం

యానాం: యానాం పట్టణ పరిధిలోని మెట్టకూరు నవోదయ విద్యాలయలో పన్నెండో తరగతి వార్షిక పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత నమోదు కావడమే కాకుండా పుదుచ్చేరి రీజియన్‌లోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుందని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థిని ఉలిసి మోహితశ్రీ సాయి హాసిని 93.80 శాతంతో ప్రథమ స్థానం, యర్రంశెట్టి యోగలక్ష్మి 92 శాతం మార్కులతో ద్వితీయస్థానం, జి.దివ్యాన్ష శ్రీసాయిరాజు 89.40 శాతం మార్కులతో తృతీయస్థానంలో నిలిచారన్నారు. అదేవిధంగా 12వ తరగతిలో మల్లాది శివకాశి 86.60 శాతం మార్కులతో ప్రథమ, బి.లాస్య 85.60 శాతం మార్కులతో ద్వితీయ, ఎల్.సాయి నాయుడు 84.20 మార్కులతో తృతీయస్థానాన్ని పొందారన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు.

లోక్ అదాలత్‌లో 791 కేసుల పరిష్కారం



అమలాపురంలో లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి నరేష్

అమలాపురం టౌన్: అమలాపురంలోని జిల్లా రెండో అదనపు కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 791 కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వి.నరేష్ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ జరిగింది. రూ.83.83 లక్షల విలువైన 15 సివిల్ దావాలు, రూ.3.35 కోట్ల విలువైన 61 మోటారు యాక్సిడెంట్ కేసులు, ఒక కుటుంబ తగాదా కేసు, 19 బ్యాంక్, బీఎస్‌ఎన్‌ఎల్ ప్రీ లిటిగేషన్ కేసులు, 695 క్రిమినల్ కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు, లోక్ అదాలత్ మెంబర్లు కె.వెంకట్రావు, జె.కనకదుర్గ, ఎస్.హమీద్ పాషా, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి మహోత్సవం



గౌతమీ గోదావరి తీరంలో కొలువైన శ్రీభక్తాంజనేయస్వామి

యానాం: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక గౌతమీ గోదావరి తీరంలోని శివాలయం సమీపంలో ఉన్న శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో వివిధ పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు పెద్దింటి నరసింహాచార్యులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామికి వేకువజామున 4 గంటలకు విశేష పంచామృతాలతో అభిషేకం, విశేష అలంకరణ చేస్తామన్నారు. భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు



ప్రమాద ప్రాంతాలను పరిశీలించి సూచనలిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

తాళ్లరేవు: రహదారులపై ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. జాతీయ రహదారి 216లో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలను కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్, కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాస్‌కుమార్‌తో కలిసి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మురళీకృష్ణ విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి నాలుగు రోడ్ల కూడలిలోనూ తారుడబ్బాలు జిగ్‌జాగ్ రూపంలో ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట కోరంగి ఏఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

క్లినిక్‌లలో ఆకస్మిక తనిఖీ



ముక్తేశ్వరంలో క్లినిక్‌ను పరిశీలిస్తున్న వైద్యులు మంగాదేవి, వైద్య సిబ్బంది

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలకు చెందిన క్లినిక్‌లపై స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు బి.మంగాదేవి, క్రిస్టఫర్‌లు శనివారం ఆకస్మికంగా తనిఖీలు జరిపారు. ఆర్‌ఎంపీ, పీఎంపీ సర్టిఫికెట్లు సక్రమంగా ఉన్నాయా లేదా, క్లినిక్‌లో రోగులకు అన్ని విధాలుగా సదుపాయాలు ఉన్నాయా లేదా అనే అంశాల్ని పరిశీలించారు. రోగులకు సిఫారస్సు చేసే మందుల వినియోగం వంటి అంశాలను పరిశీలించారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ప్రభుత్వ సూచనలు పాటించాలని హెచ్చరించారు. వీరి వెంట హెల్త్ సూపర్‌వైజర్ పి.ప్రసాదరావు, హెల్త్ అసిస్టెంట్ సీహెచ్ శ్రీనివాస్ ఏఎన్‌ఎంలు తదితరులు ఉన్నారు.

బస్ షెల్టర్, శిలాఫలకాల కూల్చివేతపై ఫిర్యాదు

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం కొమానపల్లి 216 జాతీయ రహదారి పక్కన ఉన్న బస్సు షెల్టర్, వివిధ అభివృద్ధి పనులకు ఏర్పాటు చేసిన శిలా ఫలకాలను కాకి గోపాలకృష్ణ, మరి కొంత మంది కలిసి ప్రొక్లెయిన్‌తో కూల్చివేశారని గ్రామ పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ శనివారం ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 26 ఏళ్ల క్రితం అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి బస్‌షెల్టర్‌ను ప్రారంభించారని, దాన్ని ఎటువంటి సమాచారం లేకుండా తొలగించారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.


పెంటాథ్లాన్ పోటీల్లో క్రీడాకారిణి ప్రతిభ



కాంస్య పతకం సాధించిన కీర్తి

అంబాజీపేట: పెంటాథ్లాన్ టెట్రాటిల్ రాష్ట్ర స్థాయి జూనియర్ విభాగ పోటీల్లో కె.పెదపూడికి చెందిన యర్రా కీర్తి ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించినట్లు పుల్లేటికుర్రు శేషశయన సాయి విద్యావనం కరస్పాండెంట్లు అయ్యగారి దుర్గామాధవి, కృష్ణసుందర్ తెలిపారు. స్థానిక విద్యావనంలో కీర్తిని పలువురు క్రీడాకారులు శనివారం అభినందనలు తెలిపారు. ఈ నెల 8, 9 తేదీల్లో తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి టెట్రాటిల్ చాంపియన్‌షిప్ పోటీలలో జూనియర్ విభాగంలో కీర్తి అత్యంత ప్రతిభ కనబర్చి కాంస్య పతకం కైవసం చేసుకుందన్నారు. వచ్చే నెల జూన్ 2న గోవాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు కీర్తి ఎంపికైందని పీఈటీ జె.మోహనరావు తెలిపారు. కీర్తిని పలువురు అభినందించారు.

అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో అయ్యప్ప స్వామి

అమలాపురం రూరల్: ఈదరపల్లి బైపాస్ రోడ్డులో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో 16వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప, దుర్గా నవగ్రహ హోమాలు, పంచామృత అభిషేకాలు చేశారు. ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ కోమాళ్ళపల్లి నటరాజ్ గురుస్వామి మాట్లాడుతూ పూర్వజన్మ సుకృతం వల్లే అయ్యప్ప దీక్ష అనుగ్రహింపబడుతుందన్నారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు మోరం దొరబాబు, ఆలయ కమిటీ సభ్యులు వాసన పుల్లయ్య నాయుడు, రామాయణం వెంకటేశ్వరరావు, నల్లా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.